నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 11 మార్చి 2025 | SURYAPET

## నా బిడ్డను చంపిన వాళ్లకు సరైన శిక్ష పడింది

### ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి



మిర్యాలగూడలో ప్రణయ్ సమాధి వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

మిర్యాలగూడ : తన కుమారుడు ప్రణయ్‌ను అతి దారుణంగా చంపిన నిందితులకు కోర్టు సరైన శిక్ష విధించిందని పెరుమాళ్ల బాలస్వామి అన్నారు. తీర్పు అనంతరం మిర్యాలగూడ పట్టణంలో మీడియా ఎదుట ఆయన స్పందించారు. మారుతీరావు సుపారీ ఇచ్చి తమ బిడ్డను దారుణంగా హత్య చేయించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రణయ్ హత్య తరువాత తాము చాలా కోల్పోయామని, న్యాయం కోసం పోరాటం చేశామని తెలిపారు. ప్రణయ్ హత్య తరువాత కూడా చాలా పరువు హత్యలు జరిగాయని, అలాంటి వారందరికీ కోర్టు ఇచ్చిన తీర్పుతో కనువిప్పు కలగాలని పేర్కొన్నారు. నిందితులుగా ఉండి శిక్ష పడిన వారి కుటుంబాలు కూడా బాధపడుతుంటాయని, కానీ ఇలాంటి హత్యలకు పాల్పడడం విచారకరమని తెలిపారు. అంతకుముందు కుటుంబసభ్యులు ప్రణయ్ సమాధి వద్దకు వెళ్లి సమాధిపై పూలు చల్లి నివాళులర్పిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.

# తుది తీర్పు వేళ.. క్షణ క్షణం ఉత్కంఠ

**2020లో ప్రధాన సూత్రధారి మారుతీరావు ఆత్మహత్య**

## ప్రణయ్ హత్య కేసులో ఒకరికి ఉరి శిక్ష, ఆరుగురికి జీవిత ఖైదు

- ఐదున్నరేండ్ల విచారణ అనంతరం తీర్పు
- తుది తీర్పు వెల్లడించిన నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి రోజారమణి
- చర్లపల్లి జైలుకు దోషుల తరలింపు.. కోర్టు ఎదుట టెన్షన్ టెన్షన్
- తీర్పును స్వాగతించిన న్యాయవాదులు, ప్రజా సంఘాల నాయకులు
- ప్రణయ్ సమాధి మీద పడి తల్లడిల్లిన తల్లిదండ్రులు



ప్రణయ్ హత్య కేసు తీర్పు నేపథ్యంలో కోర్టు బయట వద్ద ఉత్కంఠగా ఎదురు చూస్తున్న జనం

రామగిరి, మార్చి 10 : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసు తుది తీర్పు సందర్భంగా సోమవారం అంతటా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా కేసు విచారణలో ఉన్న నల్లగొండ జిల్లా కేంద్రంలోని న్యాయస్థానం బయట ఒక విధమైన గంభీరమైన వాతావరణం కనిపించింది. కులాంతర వివాహం నేపథ్యంలో మిర్యాలగూడలో దారుణ హత్యకు గురైన ప్రణయ్ కేసు తుది తీర్పు సోమవారం వస్తుందని ముందే ప్రచారం జరుగడంతో ఉదయం కోర్టు సమయానికి ముందే ఆ పరిసరాలకు నిందితుల కుటుంబ సభ్యులు, న్యాయవాదులు, మీడియాతోపాటు సామాన్య జనమూ పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు కోర్టు ప్రధాన ద్వారం నుంచి కోర్టు ఆవరణలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరు లోపలికి వెళ్లాలన్నా వివరాలు తెలుసుకుని, తనిఖీ చేసి మాత్రమే అనుమతించారు. నిందితులను పోలీసులు ప్రత్యేక వాహనాల్లో కోర్టుకు తీసుకువచ్చిన సమయంలో టెన్షన్ మరింత పెరిగింది. ఐదున్నర సంవత్సరాల పాటు సాగిన విచారణలో వాదోపవాదాల అనంతరం కోర్టు ఏం తీర్పు ఇస్తుందోనని అంతా ఆసక్తిగా ఎదురుచూశారు. నాటి హత్యకు సంబంధించి మాట్లాడుకోవడం, తీర్పునకు సంబంధించిన ఊహాగానాలు వినిపించాయి. కాగా, ఉదయం 11:30 గంటల నుంచి 12 గంటల సమయంలో నల్లగొండ రెండవ అదనపు సెషన్ కోర్టు, ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలనాత్మక తుది తీర్పును వెల్లడించింది. ప్రణయ్ హత్య కేసులో దోషుల్లో ఒకరి మరణ శిక్ష, మిగతా ఆరుగురికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి రోజారమణి ఈ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి, ఏ–1గా ఉన్న అమృత తండ్రి మారుతీరావు ఇప్పటికే ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. దోషులను న్యాయమూర్తి ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో వైద్య పరీక్షల అనంతరం హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించారు. దవాఖానకు తరలించే సమయంలో దోషుల కుటుంబ సభ్యులు, బంధువులు వారి వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా, పోలీసులు అడ్డుకున్నారు. చాకచక్యంగా వ్యవహరించి వాహనాన్ని ప్రశాంతంగా తీసుకువెళ్లారు. తీర్పు నేపథ్యంలో ప్రణయ్ భార్య అమృత, ఆయన తల్లిదండ్రులు కోర్టుకు వస్తారోమోనని అక్కడున్న వాళ్లు భావించినప్పటికీ వాళ్లు రాలేదు. మరోవైపు తీర్పు అనంతరం కేసులో దోషులుగా తేలిన వారి కుటుంబ సభ్యులు కొందరు తమవాళ్లు తప్పు చేయలేదంటూ గగ్గోలు పెట్టారు. కోర్టు ఆవరణలోని న్యాయవాదులు, ప్రజా సంఘాల నాయకులు తీర్పును స్వాగిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ప్రణయ్ తల్లిదండ్రులు పెరుమాళ్ల బాలస్వామి దంపతులు మిర్యాలగూడలో స్పందిస్తూ తమ బిడ్డను దారుణంగా చంపిన వాళ్లకు సరైన శిక్ష పడిందని తెలిపారు.



దోషులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

### శ్రవణ్‌కుమార్ కూతురి హల్‌చల్

తీర్పు అనంతరం మారుతీరావు సోదరుడు తిరునగరి శ్రవణ్‌కుమార్(ఏ6) భార్య, కుతూరు నల్లగొండ కోర్టు ఆవరణలోకి కారులో వచ్చారు. కారు దిగిన శ్రవణ్‌కుమార్ కూతురు స్ఫూర్తి పోలీసులు తన తండ్రిని అన్యాయంగా కేసులో ఇరికించారని, బెదిరించి బ్లాంక్ పేపర్ల మీద సంతకం చేయించుకున్నారని ఆరోపిస్తూ పెద్దపెట్టున అరించింది. తన తండ్రిని నిర్దోషిగా విడుదల చేయాలని, లేకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని ఏడ్చింది. తన పెద్దనాన్న చేసిన తప్పునకు తన నాన్నను అన్యాయంగా బలి చేశారంటూ, ఇదంతా అమృత వల్లేనని హల్‌చల్ చేసింది. మీడియా అధిక ప్రచారం వల్ల తన తండ్రి దోషిగా నిలబడాల్సిన పరిస్థితి తలెత్తిందని ఆగ్రహంతో ఊగిపోయింది. పోలీసులు జోక్యం చేసుకుని కోర్టు ఆవరణలో మాట్లాడానికి అవకాశం లేదని, కోర్టు తీర్పు వచ్చిందని చెప్పి ఆమెను కారులో ఎక్కించి బయటకు పంపించారు.

### జరిగింది ఇది..

మిర్యాలగూడ పట్టణానికి చెందిన వ్యాపారవేత్త తిరునగరి మారుతీరావు(వైశ్య) కుమార్తె అమృత అదే పట్టణానికి చెందిన పెరుమళ్ల బాలస్వామి కుమారుడు ప్రణయ్(ఎస్సీ) 2018 జనవరి 30న ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ కులాంతర వివాహం అంగీకరించని మారుతీరావు సుపారీ గ్యాంగ్‌తో ప్రణయ్‌ను అదే సంవత్సరం సెప్టెంబర్ 14న హత్య చేయించాడు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. ప్రణయ్ తండ్రి బాలస్వామి ఫిర్యాదుతో దర్యాప్తు చేసిన మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు మారుతీరావు సహా ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. అప్పటి నల్లగొండ జిల్లా ఎస్పీ ఏవీ రంగనాథ్ 1,600 పేజీల చార్జ్‌షీట్ పెట్టారు. ఎనిమిది మందిపై 302, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ కింద కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించారు. ఈ హత్య కేసులో ప్రధాన సూత్రధారి తిరునగరి మారుతీరావు(ఏ–1) కేసు విచారణ నడుస్తున్న సమయంలోనే 2020 మార్చి 7న హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ఆర్యసమాజ్ భవన్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఏ–2 సుభాష్‌శర్మ, ఏ–3 అస్గర్ అలీ విచారణ ఖైదీలుగా ఉన్నారు. మిగిలిన ఐదుగురు నిందితులు 2019లో బెయిల్‌పై విడుదలై కోర్టు విచారణకు హాజరయ్యారు. ఐదున్నర సంవత్సరాలపాటు ఇరువైపుల వాదనలు విన్న కోర్టు సాక్షులను విచారించి వివరాలు నమోదు చేసి తుది తీర్పు వెల్లడించింది. మారుతీరావు ఇప్పటికే ఆత్మహత్య చేసుకోగా, మిగిలిన వారిలో బిహార్‌కు చెందిన సుభాశ్ (ఏ2) ఉరి శిక్షతోపాటు రూ.15వేలు జరిమాన, నల్లగొండకు చెందిన మహ్మద్ అస్గర్ అలీ(ఏ2), మహమ్మద్ అబ్దుల్ బారీ(ఏ4), మిర్యాలగూడకు చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీం(ఏ5), మారుతీరావు సోదరుడు తిరునగరి శ్రవణ్ కుమార్(ఏ6), మారుతీరావు డ్రైవర్ సముద్రాల శివ(ఏ7), నల్లగొండకు చెందిన ఆటో డ్రైవర్ ఎంఏ నజీమ్(ఏ8)కు జీవిత ఖైదీతోపాటు రూ.10వేల జరిమానను విధించింది.



### తీర్పును స్వాగతిస్తున్నాం



ప్రణయ్ హత్య కేసులో పోలీసులు పూర్తి విచారణ చేసి సీసీ పుటేజీలతోపాటు నిందితుల కదలికలపై పూర్తి సమాచారంతో చార్జ్ షీట్ దాఖలు చేశారు. సీసీ పుటేజీలు, నిందితులు వాడిన ఫోన్లు, సైంటిఫిక్ సమాచారంతోపాటు అన్ని రకాల సాక్ష్యాలను కోర్టు పరిశీలించింది. విచారణ అనంతరం తీర్పు వెల్లడించింది. కేసు వాదించడంలో పోలీసులు అందజేసిన సమాచారం ఎంతో కీలకంగా పని చేసింది. నిజం గెలిచింది.. కష్టానికి ఫలితం దక్కింది. ప్రత్యేక న్యాయవాదిగా కేసు విచారణలో భాగస్వామిని అయినందుకు సంతోషంగా ఉన్నా... ఇంకా కులం అంటూ పరువు హత్యలను జరుగుతుండడం బాధగా ఉంది. ఇటీవల సూర్యాపేటలో జరిగిన ఘటన కూడా ఒకటి.

**- దర్శనం నర్సింహ, స్పెషల్ పీపీ, ప్రణయ్ హత్య కేసును వాదించిన లాయర్, నల్లగొండ**

### పోలీసుల పాత్ర భేష్ : ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నీలగిరి : ప్రణయ్ హత్య కేసు విచారణ సమయంలో సరైన ఆధారాలు సేకరించి, సాక్ష్యులను ప్రవేశపెట్టి దోషులకు శిక్ష పడేలా చేయడంలో పోలీసులు నిర్వహించిన పాత్ర అభినందనీయమని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. తీర్పు అనంతరం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కీలకంగా వ్యవహరించిన ప్రణయ్ హత్య కేసులో కీలకంగా ప్రస్తుత మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజుతోపాటు అప్పటి విచారణ అధికారి మిర్యాలగూడ డీఎస్పీ శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్, ప్రస్తుత డీఎస్పీ రాజశేఖర రాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్సై సైదిరెడ్డి, సిబ్బంది వీరస్వామి, మధుసూదన్, నరేందర్, మల్లిఖార్జున్‌ను అభినందించారు. సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ సంతోశ్, ఏఆర్ఎస్ఐ నాగరాజు ఉన్నారు.

### పరువు హత్యలు ఆగాలి



ఒక మహిళకు జరిగిన అన్యాయం పట్ల మహిళా న్యాయమూర్తి కేసును పూర్తిగా విచారించి సంచలనాత్మకమైన తీర్పు వెల్లడించడం సంతోషంగా ఉంది. ఈ తీర్పుతోనైనా సమాజంలోకి ఒక మంచి మెసేజ్ వెళ్లాలి. మళ్లీ పరువు హత్యలు జరుగకుండా ఉండాలి.

**- మామిడి ప్రమీల, ప్రముఖ న్యాయవాది, నల్లగొండ**



చివ్వెంల కస్తూర్బా గాంధీ పాఠశాలలో భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

చివ్వెంల, మార్చి 10 : విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనం అందించాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆదేశించారు. చివ్వెంల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గిరిజన గురుకుల పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, భోజనం తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అదనంగా నిర్మించనున్న 15 గదులకు రూ.2.30 కోట్లు మంజూరు కాగా వాటి నిర్మాణానికి స్థలం పరిశీలించారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ హయాంలో విద్యాలయాలకు మహర్దశ వచ్చిందని, కాంగ్రెస్ పాలనలో పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించడం లేదని అన్నారు. విద్యాలయాలను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఉన్నతమైన ఆలోచనలతో చదువాలని, తల్లిదండ్రులు కూడా వారికి ప్రోత్సాహకం అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణ శాతం సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట విద్యాశాఖ వెల్ఫేర్ ఏఈ ఓబులేశ్, జీసీఓ పూలమ్మ, ఎస్ఓ నాగలక్ష్మి ఉన్నారు.

## సూర్యాపేట ఎస్పీగా నరసింహ బాధ్యతల స్వీకరణ



డీఐజీ సన్ ప్రీత్ సింగ్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట/సూర్యాపేట టౌన్, మార్చి 10 : సూర్యాపేట ఎస్పీగా కె.నరసింహ జిల్లా కార్యాలయంలో సోమవారం డీఐజీ సన్ ప్రీత్ సింగ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఎస్పీకి ఏఎస్పీలు నాగేశ్వర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ జనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల రక్షణ, పౌరుల సంరక్షణకు పోలీసులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై సత్వరం స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని సూచించారు. అక్రమ రవాణా, అసాంఘిక చర్యలపై ఊపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఎస్పీ నరసింహ కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజల నందలాల్ పవార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ రవి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, మట్టయ్య, నరసింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సీఐలు రాజశేఖర్, వీర రాఘవులు, రఘువీర్‌రెడ్డి, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, రజితారెడ్డి, రాము, ఆర్ఐ నారాయణరాజు, నరసింహ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది ఉన్నారు.



ఆలేరు మండలం శివలాల్ తండాలో పంట ఎండిపోయిన గిరిజన మహిళా రైతును ఓదార్చుతున్న మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

## నీళ్లివ్వకుండా రైతుల ఉసురు తీస్తున్నరు

- కాంగ్రెస్ పాలనలో సాగు, తాగునీటికి కష్టాలు
- కేసీఆర్ పాలనలో ఇలాంటి పరిస్థితి ఉందా?
- ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలి
- మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

ఆలేరు టౌన్, మార్చి 9 : కరువు కోరలు తాండవిస్తున్నా, రైతులు అరిగోస పడుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, ఆయనకు ఎద్దు వ్యవసాయం తెలియదని మాజీ డీసీసీబీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆలేరు మండలం శివలాల్ తండా గ్రామంలో నీళ్లు లేక ఎండిన గిరిజన రైతులు ధారావత్ నీలమ్మ , పద్మమ్మ, ధరణమ్మ, బాలమ్మ వరి పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ధారావత్ నీలమ్మను ఓదార్చారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు కష్టాలు పడకూడదని మాజీ సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ అందించారని, కాంగ్రెస్ పాలనలో లో ఓల్టేజీ సమస్యతో పాటు సకాలంలో సాగు నీరందక వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన పొలాలకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనే దుర్మార్గపు ఆలోచనతో ఎంతో కష్టపడి నిర్మించిన కాళేశ్వరం నీళ్లు ఆపి, చెరువులు, కుంటలు నింపకుండా రైతుల ఉసురు తీస్తున్నారని మండిపడ్డారు. గత సంవత్సరం దేవాదుల ప్రాజెక్టు ద్వారా జనగామ జిల్లా నుంచి నీళ్లు తీసుకొచ్చి గుండ్ల గూడెం, శివలాల్ తండా, కందిగడ్డ తండా, టంగుటూరు, కొల్లూరు, శారాజీపేట, గొలనుకొండ తదతర గ్రామాల్లో చెరువులు నింపి నీళ్లు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య రియల్టర్లుగా మారారని విమర్శించారు. నియోజకవర్గంలో ఎవరైనా భూమి పంచాయితీ విషయంలో తన దగ్గరికి వస్తే ఎమ్మెల్యే అయిలయ్య ఇద్దరినీ మభ్యపెట్టి ఆ భూమిని కబ్జా చేసే స్థాయికి ఎదిగాడని ఆరోపించారు. అనంతరం ఆలేరు మండలంలోని శ్రీనివాసపురం గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు. నడుచుకుంటూ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత రెండు నెలలుగా తాగడానికి నీళ్లు రావడం లేదని, బోర్లు ఎండిపోయి గోస పడుతున్నామని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నీళ్ల కోసం తాసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గ్యాధపాక నాగరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ , పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మొగులుగాని మల్లేశం, మాజీ సర్పంచులు ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి, బక్క రామ్‌ప్రసాద్, కోటగిరి పాండరి, వడ్ల నవ్యశోభన్‌బాబు, బీఆర్ఎస్ నాయకులు రామనర్సయ్య, గవ్వల నర్సింహులు, పంతం కృష్ణ, మల్లేశ్‌గౌడ్, కొరుకొప్పుల కిష్టయ్య ఉన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇండ్లు వెంటనే కేటాయించాలి

### నల్లగొండ తాసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ధర్నా



నల్లగొండ తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు

నల్లగొండ రూరల్, మార్చి 10 : గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను లాటరీ ద్వారా ఎంపిక చేసిన వారికి అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల సాధన కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. స్థానిక దొడ్డి కొమురయ్య భవన్ నుంచి తాసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, సాయంత్రం వరకు అక్కడే ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాశం, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం మాట్లాడుతూ డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి లాటరీ పద్ధతితో ఇప్పటికే ఎంపిక చేసిన వారికి తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. తాసీల్దార్.. శ్రీనివాస్ ఆర్డీఓ, కలెక్టర్‌తో మాట్లాడి ఈ నెల15 వరకు ప్రొసిడింగ్ ఆర్డర్లు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు దండంపల్లి సత్తయ్య, రవీందర్, పద్మ, కృష్ణారెడ్డి, సరోజ, కోట్ల అశోక్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లింగయ్య, అరుణ, సైదాచారి, జహంగీర్, రాజేశ్ పాల్గొన్నారు.

# ఇసుక తోడవట్టె.. పంటలు ఎండబట్టె..!

**ఫలితంగా ఇంకుతున్న భూగర్భ జలాలు**

## వాగుల్లో అక్రమంగా తోడుతున్న ఇసుకాసురులు



కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఆడిషనల్ కలెక్టర్‌కు తమ గోడు వెల్లబోసుకుంటున్న రేణికుంట రైతులు

- వట్టిపోతున్న బోర్లు, బావులు.. ఎండుతున్న పంటలు
- అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం
- ప్రజావాణిలో ఉన్నతాధికారుల ఎదుట రైతుల గోడు

యాదాద్రి భువనగిరి, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : ఇసుక అక్రమ దందారాయుళ్లు అనుమతులు లేకుండా ఇసుకను తీస్తూ పంట పొలాలు ఎండిపోవడానికి కారణమవుతున్నారు. తమ స్వార్థం కోసం ఎక్కడికక్కడ భూగర్భజలాలు ఇంకిపోయేలా కారకులయ్యారు. జిల్లాలో ముఖ్యంగా రాజాపేట, ఆలేరు, గుండాల, మోత్కూరు, అడ్డగూడూరు తదితర మండలాల్లో తోడేళ్ల మాదిరి ఇసుక తోడుతూ పంటలను ఎండబెడుతున్నారు. దీనిపై ఏకంగా పలు గ్రామాల రైతులు సోమవారం ప్రజావాణిలో ఉన్నతాధికారులకు వేర్వేరుగా ఫిర్యాదు చేసి, తమ గోడును వెల్లబోసుకున్నారు.

గంధమల్ల చెరువు మత్తడి వాగు రాజాపేట మండలంలోని రేణికుంట, బేగంపేట గ్రామాల శివారు గుండా వెళ్తుంది. ఈ వాగు నుంచి నాలుగైదు నెలలుగా కాళేశ్వరం నీళ్లు ప్రవహిస్తున్నాయి. అయితే ఈ నీటి ద్వారా రెండు గ్రామాల్లోని బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయనే ఆశతో రైతులు యాసంగిలో వందల ఎకరాల్లో వరి వేశారు. కానీ కొంత మంది ఇసుక అక్రమ వ్యాపారులు, కొందరు ట్రాక్టర్ యజమానులు ఏకమై విచ్చలవిడిగా దందా చేస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా జేసీబీల ద్వారా ఇసుకను తోడుతున్నారు. ఇలా జిల్లాలోని వివిధ మండలాలతోపాటు సిద్దిపేట, జనగాం, జగదేవ్‌పూర్,గజ్వేల్, బచ్చన్నపేట, చర్యాల తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అడ్డూఅదుపు లేకుండా రాత్రి పగలు అనే తేడా లేకుండా జోరుగా దందాను కొనసాగిస్తున్నారు. దీని వల్ల బోర్లు, బావుల్లో భూగర్భ జలాల్లో అడుగంటి వరి పంటలు ఎండిపోయే పరిస్థితికి వచ్చాయి. ఇదే విషయంపై ఇసుక అక్రమార్కులను ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తూ బెదిరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. భయాందోళనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజాపేట మండలంలో చాలా గ్రామాల్లో పంట పొలాలు ఎండిపోయి.. కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. మరోవైపు రైతులు అరిగోస పడుతున్నా అధికార, పోలీస్ యంత్రాంగం పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల అధికారులు, పోలీసులకు విన్నవించినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. స్వయంగా ఇసుక ట్రాక్టర్లను పట్టించినా వెంటనే వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.